క్లుప్తంగా

అధ్వాన రహదారులతో ఇక్కట్లు



రామన్నపాలెంలో మెయిన్ రోడ్డు దుస్థితి

కోటవురట్ల: ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామీణ రహదారులు దారుణంగా తయారయ్యాయి. రోడ్లు కోరుకుపోయి పెద్ద గోతులు పడ్డాయి. వర్షాలకు ఆ గోతుల్లో నీరు చేరి అంచనా తెలియక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చీకట్లో మరిన్ని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రామన్నపాలెం, అన్నవరం, గొట్టివాడ గ్రామాలకు వెళ్లే రహదారులు పలు చోట్ల శిథిలమయ్యాయి. అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆటో ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు



ప్రమాదానికి గురైన బైక్

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. వాడ్రాపల్లికి చెందిన కర్రి రవికుమార్ గురువారం ఉదయం బైకుపై డీజిల్ తీసుకొచ్చేందుకు అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట పెట్రోల్ బంక్‌కు వెళ్లి వస్తున్నాడు. అదే సమయంలో అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వైపునకు వెళ్తున్న ఆటో ఆయనను బలంగా ఢీకొంది. ఈ ఘటనలో రవికుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో అనకాపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మునగపాక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మునగపాకలో కోతుల హల్‌చల్



మునగపాకలో ఇంటిపై తిష్టవేసిన కోతులు

మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలో ప్రజలను కోతుల బెడద వేధిస్తోంది. కొద్ది రోజులుగా కోతులు గుంపులుగా చేరి చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. ఇళ్లలోని సామాన్లతో పాటు ఇంటిపైన ఆరబెట్టుకునే దుస్తులు, వస్తువులను పాడు చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నేడు నాగులాపల్లిలో క్యాన్సర్‌పై అవగాహన

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో శుక్రవారం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు బీజేపీ నాయకుడు మళ్ల కాలేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ నగరంలోని మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రికి చెందిన మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుభద్ర పర్యవేక్షణలో ఈ సదస్సు జరగనుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైభవంగా పోలిమేరమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో పోలిమేరమ్మతల్లి

యలమంచిలి రూరల్: కొత్త ఎర్రవరంలో కొలువుదీరిన పోలిమేరమ్మతల్లి జాతర గురువారం వైభవంగా జరిగింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు అమ్మవారిని దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పలువురు మహిళలు అమ్మవారికి చీర, జాకెట్టు, గాజులు, నల్ల పూసలు, పసుపు కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించారు. ఉదయం భారీ వర్షం కురవడంతో క్యూలైన్లలో ఉన్న భక్తులు ఇబ్బందులు పడ్డారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

సాగునీరు ప్రశ్నార్థకం.!

- పూడుకుపోయిన తాండవ కాలువ
- ఆందోళనలో ఖరీఫ్ రైతులు



పాములవాక వద్ద తాండవ కాలువ



లింగాపురం వద్ద తాండవ కాలువలో పెరిగిన పిచ్చిమొక్కలు

కోటవురట్ల: ఖరీఫ్‌పై ఎన్నో ఆశలు.. పెట్టుబడి పెట్టి ఇష్టంగా పనిచేస్తే లాభాలు వస్తాయన్న ఆశ.. ఇందు కోసం ముందుగానే ప్రణాళిక వేసుకున్న అన్నదాతలు ఉత్సాహంగా వరినాట్లు వేస్తూ పరుగులు పెడుతున్నారు. ఎక్కడ చూసినా ఖరీఫ్ సాగులో తలమునకలైన రైతులే కనిపిస్తున్నారు. అయితే మరోవైపు రైతుల్లో ఎన్నో ప్రశ్నలు, అనుమానాలు దొలిచేస్తున్నాయి. సకాలంలో సాగునీరు అందుతుందా?.. పెట్టిన పెట్టుబడికి లాభాలు వస్తాయా? ఇవే ప్రశ్నలు రైతుల మదిలో సుడులు తిరుగుతున్నాయి. మండలంలో తాండవ, దుగ్గాడ కాలువలు, వరాహ నది ద్వారా వివిధ పంటలు సాగవుతాయి. ఎగువ ప్రాంతంలో వర్షాలు విస్తారంగా కురిస్తే వరాహకు జలకళ వస్తుంది. తద్వారా మోటార్లు నిరంతరాయంగా పని చేయడంతో పంటలకు నష్టం వాటిల్లదు. ఇక ప్రధానంగా తాండవా కాలువ ద్వారానే ఖరీఫ్ సాగు ఎక్కువగా జరుగుతుంది. దీని ఆయకట్టు పరిధిలో సుమారు 1400 హెక్టార్లు ఉన్నాయి. ఏడాది పొడవునా కూరగాయలు, పత్తి, పొగాకు, నువ్వులు, వేరుశనగ, కర్రపెండలం వంటి పంటలతో పాటు ఖరీఫ్‌లో వరి సాగు చేశారు. నాతవరం మండలంలోని తాండవా రిజర్వాయర్ నుంచి మండలంలోని కైలాసపట్నం వరకు కాలువ ఉండగా మహానేత వైఎస్సార్ హయాంలో సుమారు రూ.50 కోట్లతో ఆధునికీకరించారు.

కాలువంతా పూడికలే..

ప్రస్తుతం కాలువలో ఎక్కడ చూసినా పూడికలే కనిపిస్తున్నాయి. ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో పాటు సిమెంట్ లైనింగ్ పెచ్చులూడి శిథిలమైంది. రిజర్వాయర్ నుంచి నీరు వదిలినా శివారు భూములకు నీరందే పరిస్థితి లేదు. దాంతో శివారు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వంలో ఖరీఫ్‌కు ముందుగానే కాలువలో పూడిక తీయించడంతో రైతులకు సాగునీటి కొరత కనిపించేది కాదు. ధైర్యంగా వివిధ పంటలను సాగు చేసేవారు. ఈ ఏడాది కాలువలో పూడిక తీయించకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాములవాక, భీమిరెడ్డిపాలెం, నీలిగుంట, లింగాపురం ప్రాంతాలలో రైతులు ఎక్కువగా తాండవ కాలువపైనే ఆధారపడతారు. ప్రస్తుతం తాండవా రిజర్వాయర్ నిండుకుండలా కళకళలాడుతోంది. రిజర్వాయర్ నిండా నీరున్నా మండలంలోని రైతులకు సాగునీరు అందని పరిస్థితి కనిపిస్తోంది. పాములవాక నుంచి నీలిగుంట వరకు పలు చోట్ల కాలువలో సిమెంట్ లైనింగ్ శిథిలమై పెచ్చులూడుతోంది. నీలిగుంట నుంచి లింగాపురం వరకు పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. లింగాపురం నుంచి కైలాసపట్నం వరకు మట్టితో నిండిపోయి కాలువ ఆనవాలు కూడా కనిపించడంలేదు. గతేడాది మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 1758 హెక్టార్లలో వరి సాగైంది. ఈ ఏడాది కూడా ఉత్సాహంగా వరి నాట్లు వేస్తున్నారు. సుమారు 1800 హెక్టార్లలో వరి నాట్లు పడే అవకాశం కనిపిస్తోంది. అయితే ప్రధాన నీటి వనరైన తాండవా కాలువ నుంచి సాగునీరు అందే అవకాశం కనిపించడంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తాండవా నుంచి నీరు వదిలినా పూడికల కారణంగా శివారు భూములకు నీరు అందే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు.

అధికారులు స్పందించాలి



అధికారులు స్పందించి తాండవ కాలువలో పూడిక తీయించాలి. వాతావరణం అనుకూలంగా ఉండడంతో ఎంతో నమ్మకంతో వరి నాట్లు వేశాం. సకాలంలో తాండవ కాలువ నుంచి సాగునీరు అందకపోతే ఇబ్బందే. పంటలు ఎండిపోతే పెట్టుబడి కూడా నష్టపోయే పరిస్థితి వస్తుంది. వెంటనే కాలువలో పూడిక తీయించాలి.

– కన్నంరెడ్డి వరహాలబాబు, సర్పంచ్, నీలిగుంట

కాలువకు మరమ్మతు చేపట్టాలి



నీలిగుంట నుంచి కైలాసపట్నం వరకు తాండవ కాలువ దారుణంగా ఉంది. కాలువంతా తాటి మొక్కలు, పిచ్చిపాదలతో అధ్వానంగా తయారైంది. సిమెంట్ లైనింగ్ కూడా లేదు. దాంతో నీరు వదిలినా పంటలకు చేరే అవకాశం లేదు. కాలువలో పూడిక తీయించడంతో లైనింగ్ పనులు చేయించాలి. రైతులకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలి.

– చామంతుల శ్రీనివాసరావు, కైలాసపట్నం

ఎమ్మెల్సీ బొత్సకు స్వాగతం



మునగపాకలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి వస్తున్న ఎమ్మెల్సీ సత్యనారాయణ

మునగపాక: ఇటీవల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణకు గురువారం మునగపాక మండలం వైఎస్సార్‌సీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. అనకాపల్లిలోని ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సెజ్ బాధితులను పరామర్శించి అచ్యుతాపురంలోని ప్రమాదానికి కారణమైన ఫార్మా కంపెనీకి వెళుతున్న క్రమంలో భాగంగా మార్గమధ్యలో మునగపాకలోని పార్టీ కార్యాలయానికి బొత్స వచ్చారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లను పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ఆయనకు పరిచయం చేశారు. ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్సకు పలువురు నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఎంపీటీసీలు ఇల్లా నాగేశ్వరరావు, మద్దాల వీరునాయుడు, కాండ్రేగుల కిరణ్‌కుమార్, పార్టీ నేతలు దాసరి అప్పారావు, పరమేష్, ధనశ్రీను, పెదబ్బాయి పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ, మానవహారం

పాయకరావుపేట: పట్టణంలో మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు, సంస్థ సభ్యులు గవర్నమెంట్ జూనియర్ కాలేజి నుంచి సూర్యా మహల్ సెంటర్ వరకు ప్రపంచ శాంతి వర్ధిల్లాలి అంటూ శాంతి ర్యాలీ, మానవహారం నిర్వహించారు. 2004లో ఎస్.రామచంద్రారెడ్డి జంగారెడ్డిగూడెంలో 108 మంది సభ్యులతో మానవత స్వచ్ఛంద సంస్థ ఏర్పాటైంది. నేటికి రాష్ట్ర వ్యాప్తంగా 120 శాఖలతో 80 వేల మంది సభ్యులతో అభివృద్ధి పథంలో నడుస్తుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అనంతరం ఓ పేద కుటుంబానికి నిత్యావసర సరకులు అందించినట్టు సంస్థ మండల శాఖ చైర్మన్ బాలేపల్లి చినబాబు, టిక్కలి వెంకట రామకృష్ణ తెలిపారు. ఈ ర్యాలీలో సంస్థ సభ్యులు తోట నగేష్, పెదిరెడ్డి చిట్టిబాబు, జగతా శ్రీనివాస్, వెలుగుల అర్జునరావు, పెదిరెడ్డి ప్రసాద్, గొర్రెల రాజుబాబు, ధనిశెట్టి బాబూరావు, పెదిరెడ్డి శ్రీను, మజ్జూరి నారాయణరావు, మామిడి వెంకటేశ్వరరావు, వైఎస్ ప్రసాద్, కొత్తపల్లి చిట్టిబాబు, కరుటూరు లక్ష్మీనారాయణ, దుద్దుపూడి సత్యనారాయణ, మొల్లేటి నారాయణమూర్తి, పెదపూడి నరసింహామూర్తి, నల్లల చలపతిరావు పాల్గొన్నారు.

తాచేరు, శారద నదులకు జలకళ



ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో కురుస్తున్న భారీ వర్షం



తారకరామ జలాశయంలో చేరిన వర్షపు నీరు

మాడుగుల రూరల్ : వాతావరణంలో ఏర్పడిన మార్పులతో గురువారం మధ్యాహ్నం నుంచి ఒక మోస్తరుగా వర్షం కురిసింది. దీంతో తాచేరు, శారద నదుల్లో భారీగా నీరు చేరింది. దీంతో పాటు జలాశయాల్లో వర్షపు నీరు చేరుతోంది. మండలంలో పెద్దేరు, తారకరామ, ఉరకగెడ్డ, పాలగెడ్డ, జలాశయాల్లో నీరు చేరడంతో సాగునీటి అవసరాలకు నీరు ఉపయోగపడుతుంది. దీంతో పాటు బుధవారం రాత్రి కూడా ఒక మోస్తరుగా వర్షం కురిసింది. ఈ వర్షంతో ఇటు ఖరీఫ్ వరినాట్లకు, అటు చెరకు దవ్వనాట్లకు ఉపయోగపడుతుందని రైతులు పేర్కొన్నారు. గురువారం ఉదయం వరకు 2.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైందని తహసీల్దారు పి.వి.రత్నం తెలిపారు.

భారీ వర్షం.. రైతుల హర్షం



భారీ వర్షంతో నిర్మానుష్యంగా కనిపిస్తున్న రైల్వేస్టేషన్ రోడ్డు



జలమయమైన గాంధీనగరం ప్రధాన రహదారి

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణం, మండలంలో గురువారం ఉదయం 11 గంటల నుంచి 3 గంటల సేపు భారీ వర్షం కురిసింది. ఇటీవల ఆకాశం మేఘావృతమవుతుండడం వరుణుడు ముఖం చాటేయడం జరుగుతోంది. దీంతో వరి సాగు చేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తరుణంలో గురువారం వరుణుడు కరుణించాడు. ఒక్కసారిగా కారు మబ్బులు కమ్ముకుని కుండపోతగా వర్షం కురియడంతో పట్టణంలో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి. రహదారులపై వర్షపునీరు పొంగి ప్రవహించింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరి నాట్లు పూర్తి చేసిన పొలాలకు ఈ వర్షం బాగా మేలు చేస్తుందని వ్యవసాయాధికారులు తెలిపారు. అవసరమైన సమయంలో వర్షం కురవడం వల్ల పంట పొలాల్లో నీరు చేరి బాగా పదునెక్కాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనానికి ఇళ్లకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు వర్షంలో తడిసిముద్దయ్యారు.

రహదారి బురదమయం



అధ్వానంగా తయారైన రోడ్డు

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు–నర్సీపట్నం మార్గం బురదమయంగా మారింది. ప్రస్తుతం కురిసిన వర్షాలకు రోడ్డు చిత్తడిగా తయారైంది. ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకుని సీతారామపురం జంక్షన్ సమీపంలో రోడ్డు పక్కన పైపులైను మరమ్మతు పనుల కోసం తవ్విన మట్టిని రోడ్డు పక్కన వేశారు. తాజాగా కురుస్తున్న వర్షాలకు ఈ మట్టి బురదగా మారడంతో వాహనచోదకులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి



రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అంబేద్కర్

నక్కపల్లి: ప్రతి రైతు కచ్చితంగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని నక్కపల్లి తహసీల్దార్ అంబేద్కర్, మండల వ్యవసాయాధికారి ఉమాప్రసాద్ సూచించారు. గురువారం మండలంలో వీఆర్వోలు, వ్యవసాయ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి పొందే రాయితీ విత్తనాలు, ఎరువులు, పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాలకు ఈ క్రాప్ నమోదు తప్పనిసరి అన్నారు. ఈ విషయాన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సెప్టెంబరు 15వ తేదీ లోపు ఈ క్రాప్ నమోదు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. పంట వేసిన ప్రతిసారి కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు నమోదు చేయాలన్నారు.

ఎసైన్షియా యాజమాన్యంపై చర్యలకు డిమాండ్



మాట్లాడుతున్న భారత కార్మిక సంఘాల సమాఖ్య నాయకులు

యలమంచిలి రూరల్: భద్రత ప్రమాణాలు పాటించకుండా 17 మంది కార్మికుల మరణానికి కారణమైన ఎసైన్షియా ఫార్మా పరిశ్రమ యాజమాన్యంపై తక్షణం క్రిమినల్ కేసు నమోదు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా పరిశ్రమ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. పరిశ్రమల్లో కార్మికుల రక్షణకు విఘాతం కలిగేలా అమల్లోకి తెచ్చిన సెక్యూరిటీ కోడ్‌తో పాటు మూడు కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. ఫార్మా పరిశ్రమల్లో వరుసగా జరుగుతున్న ప్రమాదాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి, నిపుణుల బృందంతో విచారణ జరిపి శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. ఈ ఘటనలో బాధిత కుటుంబాలకు గరిష్ట స్థాయిలో నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విషతుల్య, విధ్వంసకర పరిశ్రమలన్నింటినీ బేషరతుగా మూసివేసి ప్రజల ప్రాణాలతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర కమిటీ సభ్యులు కె.మల్లయ్య, బి.గీత, ఎం.తిరుపతిరావు, మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం విశాఖ నగర కమిటీ ఉపాధ్యక్షుడు సీహెచ్.వెంకట్రావు పాల్గొన్నారు.

కోల్‌కతాలో హత్యాచార ఘటనపై నిరసన



రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు

మునగపాక: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారం ఘటనను నిరసిస్తూ మునగపాకలో గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో మానవహారం, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు బ్రహ్మాజీ, పార్వతి మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. చదువుకున్న అమ్మాయిల నుంచి ఉద్యోగాలు చేసే మహిళలు పని ప్రదేశాల్లో తీవ్రమైన వేధింపులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు వరలక్ష్మి, కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉమ, హేమ, శివలక్ష్మి, పాల్గొన్నారు.

జ్యువెలరీ డిజైనింగ్‌కు సాంకేతికత అవసరం

వృత్తి నైపుణ్య శిక్షకురాలు జ్యోతి కొఠారి



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి కొఠారి

అనకాపల్లి: జ్యువెలరీ డిజైనింగ్‌కు సాంకేతిక నైపుణ్యం అవసరమని ముంబాయికి చెందిన జ్యువెలరీ డిజైనర్, వృత్తి నైపుణ్య శిక్షకురాలు జ్యోతి కొఠారి అన్నారు. గురువారం స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో 'జ్యువెలరీ డిజైనింగ్' పై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్యువెలరీ డిజైన్ సృజనాత్మకత మీద ఆధారపడి ఉంటుందన్నారు. ఆభరణాల రూపకల్పన అనేది సృజనాత్మక కళ అన్నారు. డిజైనర్ ప్రతిభ, నైపుణ్యాలను బట్టి ఆదాయం సమకూరుతుందన్నారు. ఒక సాధారణ ఫ్రీలాన్స్ జ్యువెలరీ డిజైనర్ నెలకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదించవచ్చని సూచించారు. గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ ఔత్సాహకుల అభిరుచుల మేరకు గ్రంథాలయం ఆధ్వర్యంలో మరిన్ని వృత్తి నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. జ్యువెలరీ డిజైనర్ కావడానికి అండర్ గ్రాడ్యుయేట్ లేదా పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయిలో కోర్సును ప్రతి ఒక్కరూ అభ్యసించవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ అధ్యక్షుడు కర్రి శివ, సభ్యులు బొడ్డేడ జగ్గఅప్పారావు, వృత్తి నైపుణ్య శిక్షకురాలు రాపేటి ప్రేమలత, మళ్ల మౌనిక, గిలకంశెట్టి నాగమణి పాల్గొన్నారు.

ప్రమాదంపై విచారణ చేపట్టాలి

అచ్యుతాపురం: అచ్యుతాపురం సెజ్‌లోని ఎసైన్షియా ఫార్మా ప్రమాదంపై విచారణ జరిపి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరుతూ అచ్యుతాపురం జంక్షన్‌లో సీఐటీయూ గురువారం రాస్తారోకో నిర్వహించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. భద్రతా ప్రమాణాలు పాటించడంలో ఫార్మా కంపెనీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే కమిటీలు వేసి నానా హడావిడి చేస్తున్నారని వారు ఆరోపించారు. కలెక్టర్ పారిశ్రామిక వేత్తలతో సమావేశం నిర్వహించిన నెల రోజుల్లోనే మూడు ప్రమాదాలు జరిగాయని వారు ఆరోపించారు. జిల్లా అధికార యంత్రాంగం ప్రమాదానికి కారణమైన కంపెనీలపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం వల్లే తరచూ ఇటువంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కె.సోము నాయుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడు నాయుడు, సీహెచ్.రామకృష్ణ, ముఠా సంఘం నాయకులు ఆర్.సత్తిబాబు, సీహెచ్.శివాజీ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, మునగపాకకు చెందిన సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పెరిగిన ఉల్లి ధర

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం ఉల్లి ధర అమాంతంగా పెరిగింది. గత వారం కిలో రూ.40 ఉండగా, ఈ వారం రూ.50కి పెరిగింది. ఎప్పటిలాగే టమాటా, బంగాళాదుంప, దొండకాయ, బెండకాయ రూ.40, బీట్రూట్, క్యారెట్, చేమ దుంప, బీరకాయ రూ.60, క్యాప్సికం రూ.80, పొడు చిక్కుడు రూ.వంద చొప్పున విక్రయాలు సాగాయి.

స్కేటింగ్‌లో కశింకోట విద్యార్థులకు పతకాల పంట



ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన విద్యార్థులు

కశింకోట: స్థానిక సెయింట్ జాన్స్ స్కూలు విద్యార్థులు ఇంటర్ స్థాయి స్కేటింగ్ పోటీలో ఓవరాల్ చాంపియన్ షిప్ కైవసం చేసుకున్నారు. 21 మందికి బంగారు, వెండి, కాంస్య పతకాలు లభించాయి. విశాఖలో ఇటీవల యూనిక్యూ రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 8వ ఇంటర్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సెయింట్ జాన్స్ స్కూలు నుంచి పాల్గొన్న విద్యార్థుల్లో ఏడుగురికి బంగారు, 8 మందికి వెండి, ఆరుగురికి కాంస్య పతకాలు లంభించాయి. వీరిని స్కూలు ప్రిన్సిపాల్ రూపనంది, అకడమిక్ ఇన్‌చార్జి చంద్రమౌళి, కోచ్ కె. రవికుమార్, ఉపాధ్యాయ, సిబ్బంది గురువారం అభినందించారు.


'కూటమిలో బీజేపీకి అవమానాలు'

మునగపాక : బీజేపీ నాయకులకు కూటమిలో అవమానాలు ఎదురవుతున్నాయని ఆ పార్టీ సీనియర్ నాయకుడు బద్దెం సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి విజయంలో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తల కృషి ఎంతైనా ఉందన్నారు. అయితే క్షేత్ర స్థాయిలో బీజేపీకి తగిన ప్రాధాన్యత కల్పించడం లేదన్నారు. ఇటీవల మండలంలో జరిగిన పలు కార్యక్రమాలే ఇందుకు నిదర్శనమని చెప్పారు. బీజేపీని ఎన్నికల వరకే ఉపయోగించుకున్నారని, అధికారంలోకి వచ్చాక విస్మరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా పార్టీ పెద్దలు కలగజేసుకొని బీజేపీకి గుర్తింపు ఉండేలా చూడాలని సూర్యనారాయణ కోరారు.

పశువులు, నాటుకోళ్ల షెడ్ల ఏర్పాటుకు ప్రభుత్వ రాయితీ

రోలుగుంట : పశువులు, నాటుకోళ్ల వసతి కోసం షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రాయితీ ఇస్తుందని పశువైద్యాధికారి నూకేశ్వర్రావు ఒక ప్రకటనలో తెలిపారు. అందుకోసం మండలంలోని ప్రతి సచివాలయాల పరిధిలో శుక్రవారం గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. పాడి పశువులకు 10 శాతం రాయితీ, గొర్రెలు. మేకలు, నాటుకోళ్లకు 30 శాతం రాయితీ లభిస్తుందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల సొంత స్థలాల్లో నిర్మించుకునే పద్ధతిన ఈ రాయితీ కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌గా సురేంద్ర



నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్‌గా విశాఖ జీవీఎంసీలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న జె.సురేంద్రను నియమిస్తూ మున్సిపల్, పట్టణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింగల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత కమిషనర్ పూడి రవిబాబును మున్సిపల్‌శాఖ డైరెక్టరేట్‌లో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. గతంలో సురేంద్ర నర్సీపట్నం కమిషనర్‌గా పని చేశారు. రెండు, మూడు రోజుల్లో ఆయన విధుల్లో చేరుతారని కార్యాలయ సిబ్బంది తెలిపారు.

ఇసుక ట్రాక్టరు పట్టివేత

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ అల్లు స్వామినాయుడు గురువారం తెలిపారు. మామిడివాక గెడ్డ నుంచి ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఈ సందర్భంగా ట్రాక్టర్‌కు పది వేల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.